సాక్షి సంగారెడ్డి

గురువారం । 21 । డిసెంబర్ । 2023



తమ్ముడిని హత్య చేసిన అన్న

తమ్ముడిని అన్న దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణం చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేటలో చోటు చేసుకుంది.

వివరాలు 8లో ▸



వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతోనే బాబు మృతి చెందాడని తండావాసులు ఆందోళన చేశారు.

వివరాలు 8లో ▸



అద్భుతం.. 3డీ ప్రింటెడ్ ఆలయం

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో శ్రీపాద కార్యసిద్ధేశ్వరస్వామి దేవాలయాన్ని సిద్దిపేటలో నిర్మించారు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

పర్యావరణాన్ని పరిరక్షించాలి



బట్ట సంచులను
వితరణ చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఒకసారి వాడి పారవేసే పాలిథిన్ సంచుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, వాటికి బదులుగా మనం బయటకు వెళ్లేటప్పుడు విధిగా బట్ట సంచులను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. సిబ్బంది అందరికీ తెలంగాణ జాతీయ హరిత దళం అధ్వర్యంలో బట్ట సంచులను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎన్జీసీ జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, ఏడి శంకర్, సూపరింటెండెంట్ సుజాత, డీఎస్ఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టర్ శరత్‌కు వినతి పత్రం
ఇస్తున్న నాగరాజ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని పూర్వ వీఆర్ఏలు కోరారు. బుధవారం కలెక్టర్ శరత్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పూర్వ వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడుతూ.. జిల్లాలోని 1300 మంది పూర్వ వీఆర్ఏలు వివిధ శాఖలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం తమకు పదోన్నతులు, పేస్కేల్ కల్పిస్తూ జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినెంట్‌గా సర్దుబాటు చేసిందన్నారు. ఐదు నెలలు గడిచినా ఎంప్లాయి ఐడీ కార్డు ఇవ్వలేదన్నారు. ఐడీ కార్డు లేక నెలసరి వేతనాలు చెల్లించలేదన్నారు. జిల్లాకు చెందిన వారిని జోన్‌కు సంబంధం లేకుండా సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. వారిని సొంత జిల్లాకు తీసుకురావాలని కోరారు. వీఆర్ఏ వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు బస్వరాజ్, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న హన్మంత్‌రావు

నారాయణఖేడ్: పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా న్యాయ సేవాధికారిత సంస్థ కార్యదర్శి హన్మంత్‌రావు అన్నారు. నారాయణఖేడ్ కోర్టు హాలులో డివిజన్ పరిధిలోని పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్ సదావకాశమని తెలిపారు. స్థానిక కోర్టులో ఈనెల 30న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజీకాదగ్గ కేసుల్లో కక్షిదారులు రాజీపడి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయమూర్తి శ్రీధర్ మంథాని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ స్వరూప్ షెట్కార్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రోగాల ఆధారంగా చికిత్స

ప్రొఫెసర్ ప్రకాష్

పటాన్‌చెరు: వ్యక్తిగత జన్యుపరమైన వ్యత్యాసాలకనుగుణంగా ఆయా రోగాల ఆధారంగా చికిత్స అందజేయాల్సి ఉంటుందని హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ డాక్టర్ ప్రకాష్ పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో బయోమెడికల్ పరిశోధనలపై రెండు రోజుల జరిగే వర్క్‌షాప్ తొలిరోజైన బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 'క్యాన్సర్ చికిత్స కోసం ఔషధ ఆవిష్కరణలో ఆధునిక పోకడలు'పై ఆయన ప్రసంగించారు. క్యాన్సర్ పరిశోధన, మూల కణాలు, మూర్ఛ, మెదడులో కణితి, జంతు పరిశోధన ప్రాముఖ్యతను ప్రస్తావించారు. క్యాన్సర్ చికిత్సకు ఔషధాలు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రస్తుతం నివారణ లేదన్నారు. ప్రయోగశాలలో ఎలుకలు, కుందేళ్ల వంటి చిన్న జంతువుల నిర్వహణ, వాటితో వ్యవహరించే తీరుపై ఫార్మసీ విద్యార్థులకు స్వీయ అనుభవం అత్యంత ఆవశ్యకమని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పోరుపై సందిగ్ధం..!

పల్లె పోరుకు ఆలస్యం అయ్యే చాన్సు ఉంది. గత ప్రభుత్వం ఒకే రిజర్వేషన్ పదేళ్ల పాటు ఉండాలని పంచాయతీ చట్టం తెచ్చింది. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చేందుకు యత్నం చేస్తే కొంత సమయం పడుతుంది. జనవరిలో పాలకవర్గాల పదవీ కాలం ముగుస్తోంది. అనుకున్న సమయానికి ఎన్నికలు జరగకుంటే ప్రత్యేకాధికారుల పాలనకు ఆస్కారం లేకపోలేదు.

- పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ నిబంధనలతో ఇబ్బంది
- ఒకవేళ మార్చితే పల్లెపోరుకు ఆలస్యం తప్పదు
- జనవరి 31తో ముగుస్తున్న పాలకవర్గాల పదవీకాలం

నారాయణఖేడ్: పంచాయతీ ఎన్నికల పోరు సాగుతుందా లేక మరికొంత సమయం పడుతుందా అన్న సందిగ్ధం గ్రామాల్లో నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ళపాటు ఒకే రిజర్వేషన్ ఉండాలని 2019 పంచాయతీరాజ్ చట్టం తేవడంతో ఎన్నికల నిర్వహణపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు నిర్ణయాలపై ఇప్పటికే సమీక్షలు చేపడుతూ జరిగిన పొరపాట్లను వల్లెవేస్తుంది. ఈ నేపథ్యంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలను నిర్వహిస్తుందా? లేక ఏమైనా మార్పులు చేస్తుందా? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఒకవేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్‌లు కేటాయించే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రస్తుత చట్టాన్ని మార్చాలి. ఇది జరగాలంటే మరో కొత్త చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలి. ఈ ప్రక్రియ జరగాలంటే మరింత సమయం పడుతుంది.

ప్రస్తుత గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం జనవరి 31తో ముగియనుంది. ఇది ముగియడానికి మూణ్నెల్ల ముందే ఎన్నికల ప్రక్రియను కమిషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు అంత సమయం లేదు. ఆయా పరిణామాల నేపథ్యంలో స్థానిక సంగ్రామం సకాలంలో జరగకపోవచ్చు అనే అభిప్రాయం అధికారులు, రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. ఇదే జరిగితే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి రావడం అనివార్యం అవుతుంది. జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కలిపి 647 గ్రామ పంచాయతీలు, 4,778 వార్డులు ఉన్నాయి.

ఇది బ్యాలెట్ పోరు



తుర్కాపల్లిలోని పంచాయతీ భవనం

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితానే ప్రామాణికంగా తీసుకుంటారు. అయితే దాన్ని పంచాయతీలు, వార్డుల వారీగా విభజించాల్సి ఉంటుంది. కొత్తగా అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన జరిపి తుదిజాబితా వెల్లడించడం తప్పనిసరి. ఈ ప్రక్రియకు కనీసం నెల రోజుల సమయం పడుతుందని ఎన్నికల విభాగం అధికారులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల జాబితాలో దొర్లిన తప్పుల సవరణకు సంబంధించి ఓటర్లకు అవకాశం ఇవ్వాలి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పంచాయతీ పోరుకు తుది ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేసేందుకు వీలుంది. ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు సేకరించాలి. బ్యాలెట్ పత్రాలను ముద్రించాలి. ఇదంతా జరగాలంటే ఇప్పుడున్న సమయం కూడా చాలదు. ఈ కోణంలో చూసినా ఎన్నికల నిర్వహణ సాధ్యమా అన్న వాదన వినిపిస్తోంది.

పల్లెల్లో రాజకీయ వేడి

వచ్చే ఏడాది పంచాయతీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఇప్పటి నుంచే గ్రామాల్లో రాజకీయ వేడి మొదలైంది. పంచాయతీ, పార్లమెంట్, మండల, జిల్లా ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు వరుసగా జరగనున్న విషయం విదితమే. దీంతో వచ్చే ఏడాదంతా పండగ వాతావరణం నెలకొననుంది. తొలుత జరిగే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టారు. పార్టీల నాయకులు సైతం ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. ఎన్నికలు పార్టీల గుర్తులపై జరగకున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ప్రధాన పార్టీల అండదండలతోనే అభ్యర్థులు బరిలో నిల్చుంటారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల్లో తాము పడిన కష్టానికి ప్రతిఫలంగా తగిన సహకారాన్ని అందించాలని ఆశావహులు నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- చేపల వేటకు వెళ్లి తండ్రి, తనయుడు మృత్యువాత



మృతిచెందిన తండ్రీ కొడుకు

హత్నూర(సంగారెడ్డి): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు తండ్రీకుమారుడు మృతిచెందిన సంఘటన హత్నూర మండలం తురకల ఖానాపూర్ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సాధులనగర్‌కు చెందిన చెక్కల ప్రభు(46) కుమారుడు నాగరాజు (23) ఇద్దరూ కలిసి మంగళవారం సాయంత్రం తుర్కల్ ఖానాపూర్ శివారులోని ఊర చెరువులోకి చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కొడుకు నాగరాజుకు వల చుట్టుకొని మునిగిపోతుండడంతో గమనించిన తండ్రి కొడుకును కాపాడుకోవాలనే తపనతో నీటిలోకి దిగాడు. ఈక్రమంలో ఇద్దరూ మృత్యుఒడిలోకి చేరుకున్నారు. చేపల వేటకు వెళ్లిన వారు తిరిగి ఇంటికి రాకపోవడంతో బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లగా మృతదేహాలు నీటిలో తేలాయి. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న హత్నూర ఎస్సై సుభాశ్ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా: ఎమ్మెల్యే సునీతారెడ్డి

బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే సునీత అన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజేందర్, సర్పంచ్ భాస్కర్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో అన్యమత ప్రచారం

- ప్రిన్స్‌పాల్‌ను నిలదీసిన హిందూ సంఘాలు

పుల్‌కల్(అందోల్): ఆదర్శ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు వివాదాస్పదంగా మారాయి. ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పాస్టర్‌లు జీసస్ బోధనలు చేయడంపై హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. చిన్నారులకు మత విశ్వాసాలపై విషం చిమ్మడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బస్వాపూర్ ఆదర్శ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను పాస్టర్‌లతో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల సమక్షంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థులతో జీసస్ గొప్పతనాన్ని కీర్తిస్తూ గీతాలను ఆలపించారు. జీసస్ సూక్తులపై కట్టుబడి ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కాగా, ప్రభుత్వ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, బజరంగ్‌దళ్ కార్యకర్తలు అన్యమత ప్రచారంపై ప్రిన్స్‌పాల్ జ్యోతి హెబ్సిబాను నిలదీశారు. అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

మాకు ఉపాధి కల్పించండి



చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

- ఆటో డ్రైవర్ల నివేదన
- పట్టణంలో ర్యాలీ, చౌరస్తాలో రాస్తారోకో

నర్సాపూర్: తమకు ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్‌తో బుధవారం ఆటో డ్రైవర్లు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం నుంచి ప్రారంభమై పట్టణంలోని పలు వీధుల గుండా తిరిగి చౌరస్తా వద్దకు చేరుకుంది. ఇక్కడ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల తమ బతుకులు ఛిద్రమవుతున్నాయన్నారు. రాస్తారోకోలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు ఆంజనేయులు, భిక్షపతి, నాగభూషణం, రాజు, కుమార్, లక్ష్మణ్‌గౌడ్, ఖదీర్, సత్యనారాయణ, రాములు, మహేష్, మునీర్, రామాగౌడ్, సలీం పాల్గొన్నారు.

టీడీఎస్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్: ఆదాయ పన్ను, టీడీఎస్ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదాయపు పన్ను శాఖ టీడీఎస్ విభాగం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆదాయ పన్ను శాఖ హైదరాబాద్ కార్యాలయ ఇన్‌కం టాక్స్ అధికారి మానస్ రంజన్ మెహర మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలోగా కరెక్ట్ టీడీఎస్ రిటర్న్ సమర్పించాలని సూచించారు. దాఖలు చేయడంలో ఏవేని సమస్యలు ఉంటే www.tdscpc.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని లాగిన్ అయి క్లారిఫికేషన్ పొందాలని సూచించారు. ఆదాయపు పన్ను, టీడీఎస్ నిబంధనలు, ఫైలింగ్ ఏ విధంగా చేయాలి తదితర అంశాలపై వివరించారు. ఈసందర్భంగా పలువురు డీడీఓల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి కవిత, జిల్లాలోని అన్ని శాఖల డీడీఓలు, హైదరాబాద్ ఇన్‌కం టాక్స్ కార్యాలయ అధికారి పావల్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

- మున్సిపాలిటీల్లో వంద శాతం లక్ష్యం
- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- మున్సిపల్ కమిషనర్లకు దిశానిర్దేశం

సిద్దిపేటరూరల్: మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో భాగంగా ఆస్తి పన్ను వసూళ్లపై సిద్దిపేట, గజ్వేల్–ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీ కమిషనర్లు, మున్సిపల్ అధికార వర్గాలతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో నిర్మాణ దశలో ఉన్న పలు భవనాల నిర్మాణం, పురోభివృద్ధిపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పలు భవన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఆయా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పర్యటించి చెత్త సేకరణ, డంపింగ్ యార్డు గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి భారీ జరిమానాలు విధించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వైకుంఠ ధామాల పనులు వెంటనే చేపట్టాలన్నారు. వచ్చే వానాకాలం నాటికి హరిత హారం కార్యక్రమానికి సంబంధించి నర్సరీలలో మొక్కల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీలకు బ్యాగులను అందజేసినట్లు, మట్టిని నింపే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కమిషనర్లకు ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు సంపత్ కుమార్, విద్యాధర్, గణేశ్, రాజశేఖర్, రాజేంద్రకుమార్, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్లు, రెవెన్యూ అధికారులు, డీటీసీపీఓ వందన తదితరులు పాల్గొన్నారు.

సర్కారు తోట సర్వే..



సంఘటన స్థలంలో పోలీసులు, గ్రామస్తులు

- అడ్డుకున్న గ్రామస్తులు
- రాయపోలులో ఉద్రిక్తత



గ్రామస్తులకు వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రంలో దశాబ్దాలుగా వివాదాస్పదంగా ఉన్న సర్కారు తోటపై మరోమారు ఉద్రిక్తత చోటుచేసుకుంది. సర్కారు తోట సర్వే చేసేందుకు అధికారులు రావడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని సర్వేనంబరు 1391, 720లోని 20 ఎకరాల 5 గుంటల భూమిపై దాదాపు 5 దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోంది. ఆ భూమి గ్రామానికి చెందుతుందని స్థానికులు చెబుతుండగా.. చట్టప్రకారం తాము కొనుగోలు చేశామని యాజమానులు అంటున్నారు. కాగా ఆ భూమిలోంచి 5 ఎకరాలను గతేడాది ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవచ్చని గవర్నర్ పేరిట భూ యాజమాని జలంధర్‌రెడ్డి రిజిస్ట్రేషన్ చేయించారు. కాగా బుధవారం గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ ప్రభుత్వానికి కేటాయించిన 5 ఎకరాల భూమికి హద్దులు వేసేందుకు సిబ్బందితో వచ్చారు. కాగా గ్రామంలో వివాదానికి కారణమైన ఈ భూమిలో సర్వే చేస్తే శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని భావించి భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. కాగా ముందస్తుగానే తెల్లవారుజామున కొందరికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం 11 గంటలకు అధికారులు భూమి వద్దకు చేరుకోగానే కొందరు గ్రామస్తులు, మహిళలు అక్కడకు రాగా వారిని పోలీసులు అక్కడి నుంచి తరలించారు. మధ్యాహ్నం వరకు అధికారులు వేచిచూసినప్పటికీ గ్రామస్తులు అడ్డు తొలగకపోవడంతో సర్వేను వాయిదా వేశారు. మూడు రోజులు అవకాశమిస్తున్నట్లు, ఆ తర్వాత తిగిరి వచ్చి సర్వే చేస్తామని ఆర్డీఓ బన్సీలాల్ తెలిపారు. ఆ తర్వాత చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

- జాబితాలో తప్పులు లేకుండా ఈసీ చర్యలు
- కసరత్తు ప్రారంభించిన అధికార యంత్రాంగం



ఇంటింటా ఓటరు నమోదు కార్యక్రమాన్ని
చేపడుతున్న బీఎల్ఓలు

సిద్దిపేటరూరల్: ఓటరు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. త్వరలోనే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలు రానుండటంతో ఎన్నికల సంఘం ప్రక్రియను ముమ్మరం చేసింది. అయితే ఏటా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ ప్రకటిస్తుండగా.. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు అవకాశం ఇచ్చింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి.. అక్టోబర్‌లో తుది జాబితా ప్రకటించగా నవంబర్ రెండో వారంలో అనుసంధాన జాబితా ఇచ్చింది. దాని ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు.

జనవరి 5 వరకు గడువు..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాను సవరణ చేస్తున్నారు. బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) మళ్లీ ఇంటింటికీ తిరిగి కొత్త దరఖాస్తుతో పాటు మార్పులు, చేర్పులు, సవరణలుంటే వివరాలు సేకరిస్తారు. ఈ ప్రక్రియ వచ్చే జనవరి 5 వరకు చేపట్టనున్నారు. అదే నెల 6న ముసాయిదా జాబితా ప్రకటించి... దీనిపై 22 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. వీటిపై బీఎల్ఓలు మారోసారి సర్వే చేపట్టి పరిష్కరిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి 2న జాబితా పరిశీలన, అదే నెల 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

వచ్చే నెల ఒకటి ప్రామాణికం..

జాబితాలో పేరు లేనివారు కొత్త దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చేనెల 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు. అర్హులని ఎన్నికల సంఘం పేర్కొంది. వీరు సీఈఓ వెబ్‌సైట్లో గాని, స్థానికంగా ఉండే బీఎల్ ఓల వద్ద ఫారం – 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిబ్రవరిలో ఇచ్చే తుది జాబితాలో పేరుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

ప్రత్యేక క్యాంపెయిన్..

పోలింగ్ బూత్ స్థాయిలో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. శని, ఆదివారాలు ప్రత్యేకంగా కార్యక్రమం జరగనుండగా.. ఎన్నికల సంఘం త్వరలోనే తేదీలను ప్రకటించనుందని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా ఉండేవారు కొత్తగా నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం దరఖాస్తులను బీఎల్వోలకు అందించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి



ప్రజాస్వామ్యంలో ఓటు విలువ వెలకట్టలేనిది. ఓటు అనే బ్రహ్మాస్త్రంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశముంది. అర్హులైన వారు ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పిస్తోంది. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి.

– కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

క్లుప్తంగా

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



జగదీశ్‌తో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, పీడీ వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని లింగరాజుపల్లి ఎంజేపీ బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా పీడీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 10వ తరగతి చదువుతున్న విద్యార్థి జగదీశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్–17 విభాగంలో హాకీ పోటీల్లో ప్రతిభచాటి జాతీయ స్థాయికి ఎంపికావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు ఎంపిక



ఆగస్టీన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) సిద్దిపేటలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఆగస్టిన్ జాతీయ స్థాయిలో నిర్వహించే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి జనవరి 1 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే నేషనల్ అడ్వెంచర్ క్యాంపునకు హాజరు కానున్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు మధుసూదన్, కృష్ణయ్య ఆగస్టీన్‌కు అభినందనలు తెలిపారు. క్యాంప్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొననున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు తెలిపారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు..



రజనీ, వైష్ణవి

గజ్వేల్‌రూరల్: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రత్యేకాధికారి అనురాధ, పీఈటీ జ్యోతి పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో గల కేజీబీవీలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఎం.రజని, వీ.వైష్ణవి అక్టోబర్‌లో మేడ్చల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి 24 తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే 29వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిథ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలోనూ రాణించి, పాఠశాలకు పేరు తీసు కురావాలని ఆకాంక్షిస్తూ.. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

అద్భుతం.. 3డీ ప్రింటెడ్ ఆలయం

30 రోజులు.. 30 గంటల్లో నిర్మాణం

- దేశంలోనే మొదటిదిగా సిద్దిపేట శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయం ఘనత
- ఇటీవలె ప్రారంభం.. నిత్యం విశేష పూజలు
- మోదక్ ఆకారం గుడిలో హేరంబ గణపతి
- దీర్ఘచతురస్రాకార గుడిలో దత్తాత్రేయ స్వామితోపాటు స్ఫటికలింగం
- నిర్మాణాన్ని పరిశీలిస్తున్న యువ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు



సిద్దిపేటలోని శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయం

సాక్షి, సిద్దిపేట : ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ఎంతో వ్యయ ప్రయాసాలు తప్పవు.. సామగ్రి, కూలీలు అన్నీ ఇన్నీ కావు.. ఒకవేళ అందుబాటులో ఉన్నా నిర్మాణం పూర్తి కావాలంటే నెలలు గడవాల్సిందే. ఈ కష్టాలన్నింటికీ చెక్ పెడుతూ .. స్వల్ప వ్యవధిలోనే నిర్మాణాలు పూర్తి చేసే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. దేశంలోనే మొట్టమొదటి త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ (రోబో)తో ఆధ్యాత్మిక శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయాన్ని సిద్దిపేటలోని బూరుగుపల్లి సమీపంలో నిర్మించారు. నెలరోజులపాటు 3డీ ప్రిటింగ్‌తో 30 గంటల్లో దేవాలయ నిర్మాణం పూర్తి చేసి ఔరా అనిపించారు. ఈ త్రీడీ దేవాలయాన్ని 3,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 30 అడుగుల ఎత్తులో నిర్మించారు.



దేశంలోనే తొలి దేవాలయం

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ(రోబో) మిషన్‌ను ఏబీబీ అనే యూరోపియన్ నుంచి తీసుకొచ్చారు. దీనిలో ఉండే ఇంటర్నల్ సిస్టమ్, దీని కోసం వినియోగించే సాఫ్ట్‌వేర్‌ను భారతదేశంలోనే తయారు చేశారు. ప్రపంచంలోనే తొలిసారిగా 2022లో 3డీ ప్రిటింగ్ విధానంలో కాలిఫోర్నియాలోని టిహమా కౌంటీలో చర్చి నిర్మించారు. సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ ఈ ఏడాది మార్చిలో ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి దేశంలోనే తొలి త్రీడీ ప్రింటెడ్ నమూనా వంతెనను నిర్మించింది. దేశంలోనే తొలిసారిగా మిషనరీతో సిద్దిపేటలో దేవాలయం నిర్మించారు.

ఇటీవల ప్రారంభం

సిద్దిపేటలో త్రీడీ టెక్నాలజీతో నిర్మించిన శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయం ఇటీవల ప్రారంభించారు. వారం రోజులపాటు విగ్రహప్రతిష్ట మహోత్సవాలను నిర్వహించారు. నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు దేవాలయం నిర్మించిన తీరును అడిగి తెలుసుకుంటున్నారు. త్వరగా నిర్మాణం పూర్తికావడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం ఇంజినీర్లు, పలు నిర్మాణ సంస్థలు వచ్చి నిర్మాణంను పరిశీలిస్తున్నారు.



ఒక్కో గర్భగుడికి ఒక్కో ప్రత్యేకత

దేవాయలంలో గర్భగుడీలు ఒక్కొక్కటి ఒక్కో ఆకారంలో నిర్మించారు. హేరంబ గణపతి కోసం మోదకం ఆకారంలో గర్భగుడిని నిర్మించారు. ఇది 11 ఫీట్ల ఎత్తు, 8 ఫీట్ల వెడల్పు ఉంది. వీటి నిర్మాణం వారం రోజులపాటు 7 గంటలు ప్రింటింగ్‌తో నిర్మాణం పూర్తి చేశారు. అలాగే భువనేశ్వరి అమ్మవారి కోసం కమలం మొగ్గ ఆకారంలో గర్భగుడిని నిర్మించారు. ఎత్తు 11 ఫీట్లు , వెడల్పు 8.5 ఫీట్లు ఉంది. ఈ ఆకారం నిర్మాణం కోసం వారం రోజులపాటు ప్రింటింగ్ 8 గంటలు పట్టింది. దత్తాత్రేయ స్వామితోపాటు స్ఫటికలింగానికి గర్భగుడి దీర్ఘచతురస్రాకారంలో నిర్మించారు. 10 రోజులపాటు 15 నుంచి 16 గంటల సమయం పట్టింది.



కంప్యూటర్‌లో రూపొందించి

కంప్యూటర్‌లో ముందుగా దేవాలయం డిజైన్ పొందుపర్చి కాంక్రీట్ త్రీడీ మిషన్ ద్వారా నిర్మించారు. అప్సూజ కంపెనీ నిర్మాణ బాధ్యతలను తీసుకొని సింప్లీ పోర్జ్ అనే త్రీడీ టెక్నాలజీ కంపెనీకి అప్పగించింది. మోదక్, దీర్ఘచతురస్రాకారం, కమలం మొగ్గ ఆకారాల్లోని గర్భ గుడీలతోపాటు ఆలయ గోపురాలను కంప్యూటర్‌లో తొలుత 3డీలో డిజైన్ చేసి ఆపై యంత్రాల ద్వారా నిర్మించారు. దీంతో ఆలయం భక్తులకు కనువిందు చేస్తోంది.

కూలీల పని తప్పింది



3డీ ప్రింటింగ్ టెక్నాలజీ(రోబో) మిషన్‌ను ఏబీబీ అనే యూరోపియన్ నుంచి తీసుకొచ్చాం. దీనికి సంబంధించి మొత్తం సాఫ్ట్‌వేర్‌ను మన దేశంలోనే తయారు చేసి నిర్మాణం చేపట్టాం. కూలీల వ్యయప్రయాసలు తప్పాయి.

– హరికృష్ణ, సీఈఓ

తమ్ముడిని హత్య చేసిన అన్న

- భూ పంపిణీలో భాగంగా వివాదం
- మృతుడు శాలిపేట గ్రామ ఉపసర్పంచ్

చిన్నశంకరంపేట(మెదక్): ఒకే కడుపున పుట్టిన తమ్ముడిని అన్న దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణం చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శాలిపేట గ్రామానికి చెందిన ముంద్రాతి ఆంజనేయులు (35), సత్యనారాయణ, సిద్దిరాములు ముగ్గురూ అన్నాదమ్ముళ్లు. వీరు ఇప్పటికే తల్లిదండ్రుల ఆస్తి పంచుకున్నారు. ఇందులో సత్యనారాయణకు చెరువు సమీపంలో ఐదెకరాలు రాగా, ఆంజనేయులుకు పోచమ్మ మర్రిచెట్టు సమీపంలో ఐదెకరాలు వచ్చింది. సత్యనారాయణ పొలం వద్ద నీళ్ల సరిగా లేవని, మళ్లీ భూమి పంచుకుందామని ఆంజనేయులుతో అన్నాడు. ఇద్దరం మర్రిచెట్టు దగ్గర ఒక్కొక్కరికి రెండున్నర, చెరువు దగ్గర రెండున్నర చొప్పున తీసుకుందామని గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయించుకున్నారు.

సత్యనారాయణ చెప్పినట్లు భూమిని పంచారు. చెరువు దగ్గర ఉన్న బోరును కూడా ఇద్దరూ సమానంగా వాడుకోవాలని గ్రామపెద్దలు చెప్పారు. ఈ క్రమంలో బోరు మాత్రం నేను ఒక్కడినే వాడుకుంటా అని సత్యనారాయణ అన్నాడు. దీనికి అంజనేయులు ఒప్పుకోకపోవడంతో వివాదం మొదలైంది. రోజులాగే బుధవారం ఉదయం నారుమడికి నీరు పెట్టేందుకు ఆంజనేయులు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సత్యనారాయణ మరో వ్యక్తితో కలిసి ఆంజనేయులుపై దాడి చేసి తలపై కొట్టాడు.



ఆంజనేయులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తీవ్ర గాయాలతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలని ఆందోళన

పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు ప్రయత్నించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, అప్పటి వరకు మృతదేహాన్ని తరలించేది లేదని బంధువులు అడ్డుకున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రామాయంపేట సీఐ లక్ష్మీబాబు , చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి, నిజాంపేట ఎస్‌ఐలు నారాయణ, హరీశ్‌గౌడ్, మొహినుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రెండు కార్లు చోరీ

పటాన్‌చెరు టౌన్: రెండు కార్లు చోరీకి గురైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి ఇంటి ఎదుట పార్కింగ్‌లో ఉంచిన ఫార్చునర్ కారు అద్దం పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన ఓం ప్రకాశ్ పోచమ్మ దేవస్థానం వద్ద పార్కింగ్ చేసిన ఇన్నోవా కారును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు ఇద్దరు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..

పటాన్‌చెరుటౌన్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ మంగళవారం ఉద్యోగానికి వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేసరికి తాళం పగుల గొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.1.05 లక్షల నగదు, మూడు తులాల బంగారం కనిపించలేదు. ఇంట్లో చోరీ జరిగినట్లు దయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాబు మృతి

కొడిపల్లి మండలం కొత్తచెరువు తండావాసుల ఆందోళన



కౌడిపల్లి సీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న కొత్తచెరువు తండావాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతోనే బాబు మృతి చెందాడని తండావాసులు ఆందోళన చేసిన ఘటన కౌడిపల్లి సీహెచ్‌సీలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండాకు చెందిన కాత్రోత్ కల్పనకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో డెలివరీ కోసం కౌడిపల్లి సీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. డాక్టర్, స్టాఫ్‌నర్స్ పలు పరీక్ష నిర్వహించారు. బుధవారం డెలివరీ సమస్య ఉందని వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు నార్మల్ డెలివరీ చేయగా పుట్టుకతోనే చనిపోయాడు. కౌడిపల్లి సీహెచ్‌సీ వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్లే బాబు మృతి చెందాడని కల్పన భర్త నర్సింగ్, అన్న గోపాల్, సర్పంచ్ భర్త దూద్యనాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధన్‌సింగ్, తండావాసులు సీహెచ్‌సీ వద్ద ఆందోళన చేశారు. వైద్యసిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తండావాసులకు నచ్చజెప్పారు. కల్పన డెలివరీకి ఇబ్బంది పడుతుంటే తాము వేరే ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పినా వైద్యులు పంపలేదని తండావాసులు ఆరోపించారు.

రెఫర్ చేసినా తీసుకెళ్లలేదు

కల్పనకు పురిటి నొప్పులు రావడంతో చికిత్స చేశామని డాక్టర్ ప్రవీణ్, స్టాఫ్‌నర్స్ తెలిపారు. ఆదే రోజు మెదక్ రెఫర్ చేశామన్నారు. అయినా తీసుకెళ్లకుండా ఇక్కడే డెలివరీ చేయాలని చెప్పారని వివరించారు. బుధవారం ఉదయం 108కు తామే ఫోన్ చేసి మెదక్ ఆస్పత్రికి పంపించామన్నారు. వైద్యం చేయడంలో తమ నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీహరి మృతదేహం

నిజాంపేట(మెదక్): విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన రాగుల శ్రీహరి (32) బుధవారం ఉదయం పొలం వద్ద వరి నారుమడికి నీరు పెట్టడానికి వెళ్లాడు. తన పొలంలో పైనే హైటేషన్ విద్యుత్ తీగల కిందికి ఉన్నాయి. అయితే, వరినారు మడిపై ఉన్న నీటిని కర్రతో తొలగించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కర్ర విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రమైన శ్రీహరి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య కల్యాణి, మూడేళ్ల బాబు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు ఎంపిక

కోహెడరూరల్(హుస్నాబాద్): గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌లో కోహెడ మండలంలోని పెరుకలగడ్డ వింజపల్లి ప్రధానోపాధ్యాయులు డి.రవివర్మ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పావని పలువురు ఉపాధ్యాయులు రవివర్మను అభినందించారు. ఈనెల 22న హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సులో గణిత అంశాలను పవర్ పాయింట్ ప్రదర్శన చేయనున్నారు.

చెరకు జాగ్రత్తలు మరవకు

- పంట వేసినప్పటి నుంచి తప్పనిసరి
- పక్వానికి రాకముందే క్రషింగ్‌కు తరలించొద్దు
- చక్కెర ఉత్పత్తి తగ్గడమే కాకుండా నష్టాలు
- సూచనలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు



శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): చెరకు సాగులో ఆధునిక సాంకేతికత దినదినాభివృద్ధి చెందుతుండటంతో ముస్ముందు ఈ పంట భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తోంది. కానీ పంటలు వేసినప్పటీ నుంచి చేతికందే వరకు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. సరైన పద్ధతులు పాటించకుండా పాత పద్ధతులను పాటిస్తే నష్టపోతారు. కొంత మంది రైతులు చెరకు పక్వానికి రాకముందే క్రషింగ్‌కు తరలిస్తూ ఉంటారు. దీంతో చక్కెర ఉత్పత్తి తగ్గడమే కాకుండా సరాసరి చెక్కెర ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. చెరకు పంట పక్వానికి వచ్చిందా ?లేదా? కొన్ని లకువలు పాటించాలి. ప్రస్తుతం చేతికొచ్చిన చెరకు పంటను నరకుటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బసంత్‌పూర్–మామిడ్గి గ్రామాల శివారులో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎం.విజయ్‌కుమార్ మాట్లాల్లోనే..



బసంత్‌పూర్‌లో చెరుకు నరుకుతున్న యంత్రం

పక్వానికి వచ్చిందా.. లేదా?

- పక్వానికి వచ్చిన చెరకు తోటల ఆకులు పచ్చ రంగులోంచి పసుపు రంగులోకి మారుతాయి.
- చెరకులో కొత్తగా మొవ్వటాకులు రావడం ఆగిపోతాయి.
- గడలు లావై అక్కడక్కడ చిరు పగుళ్ల ఏర్పడి కన్నులు బాగా ఉబ్బినట్లు అవుతాయి. తోటలో కొత్తగా మొవ్వటాకులు రావడం ఆగిపోతాయి.



- చిట్ట చివర నాలు గైదు కణుపులు దగ్గర దగ్గర ఏర్పడి వాటి నుంచి పుట్టు ఆకులు ఒకే చోట కుచ్చువలె ఏర్పడుతాయి.
- కొన్ని రకాల్లో పూత పూయడం కనబడుతుంది. శాస్త్రీయంగా గమనిస్తే చెరకును రెండు భాగాలు నరికి వాటి రసంను వేర్వేరుగా గానుగాడిస్తే వాటిలోని ఘన పదార్థాలు సమానంగా ఉండాలి.
- చేతి రిఫ్రాక్టో మీటర్ ద్వారా కూడా చెరకు పక్వానికి వచ్చింది తెలుసుకోవచ్చు.
- వాతావరణ పరిస్థితులపై కూడా ఆధారపడి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చీడ పీడలు ఆశించిన చెరకును ముందుగా క్రషింగ్‌కు తరలించాలి. లేదా బెల్లం తయారీకి వాడాలి.
- ఆలస్యం చేస్తే దిగుబడులతో రసం నాణ్యత తగ్గుతుంది. బెల్లం తయారు చేశాక మెత్తగా ఉంటే నిల్వకు పనిరాదు.
- ఏదైనా ప్రమాదశాత్తు చెరకు కాలిపోతే ముందుగా దాన్ని నరికివేయాలి . లేకపోతే తూకం తగ్గి రోజుకు 3 శాతం చొప్పున తగ్గుతుంది.
- పూత వచ్చిన, బెండు బారిన చెరకును నరకడం ఆలస్యం చేయరాదు. పూత వచ్చిన చెరకు గడల్లో చివరి ఆరు కండాలు తీసేసి మిగిలిన చెరకును ఫ్యాక్టరీకి తరలించాలి.
- చెరకును భూ మట్టానికి నరకాలి. రెండు మూడు అంగుళాలు వదిలి నరకడం వల్ల ఎకరానికి రెండు మూడు టన్నులు దిగుబడి తగ్గుతుంది.
- కింది భాగంలో పంచదార పాలు ఎక్కువగా ఉంటాయి. అంతే కాకుండా చెరకు వేర్లు భూమిలోకి చొచ్చుకొని పోయి బలమైన గాలులు వీచినా చెరకు ఒరిగిపోదు.
- చెరకు క్రషింగ్‌కు తరలించే ముందు చెత్త, ఎండుటాకులు, వేర్లు, మట్టి లేకుండా తరలించాలి. చెత్తా చెదారంతో తరలించడం వల్ల పంచదార దిగుబడిలో 10 శాతం నష్టం వాల్లుతుంది.
- నీటి ముంపునకు గురైన తోటల్లో గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు కణుపుల వద్ద వచ్చే వేర్లను తొలగించాలి.
- వేర్లను తీసేయకుండా చెరకును అలాగే క్రషింగ్‌కు తరలిస్తే 0.4 నుంచి 0.6 శాతం మేర పంచదార దిగుబడి తగ్గుతుంది.

నరికిన తర్వాత

- నరికిన చెరకును 24 గంటల్లో ఫ్యాక్టరీకి సరఫరా చేయాలి. ఆలస్యమైన కొద్ది చెరకు తూకంలో 2 నుంచి 4 శాతం, రసనాణ్యతలో ఒక శాతం తరుగుదల కనిపిస్తోంది.
- నరికిన చెరకు తొందరగా ఫ్యాక్టరీకి తరలించలేని పక్షంలో కట్టిన చెరకు మోపులను నీడలో పెట్టి వాటిపై చెత్తను కప్పి నీరు పలుచగా పోయాలి.
- రైతులు సాగు మొదలు పెట్టినప్పటి నుంచి చివరి వరకు ఇలాంటి మెలకువలు పాటిస్తేనే లాభాలు సాధిస్తారని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



చెరకు నరుకుతున్న కూలీ